# "చెలిమియా—బలిమియా"

చదువుల రామచంద్రయ్యగారు, బి. ఎ.

[స్త్రీ స్వాతంత్ర్యమున కునికిపట్టనదగిన పాశ్చాత్యదేశములందుగూడ స్త్రీలకు కించిత్తయిన స్వాతంత్ర్య మివ్వకూడదను సంకుచితస్వభావము లుండెడివి. భర్త పలుబాధలు పెట్టినను పల్లెత్తు మాటాడని భారతీయసతీమతల్లులవంటి మానినీమణులుగూడ నుండెడివారు. దాని కొక నిదర్శనము ]

తుపాను వచ్చుటకు మున్ను ప్రశాంతముగనున్న పారావారమువలె మరునాటి సంగ్రామమునకై పరాసుసైన్యము శాంతముగ విడిసియుండెను. దుర్భర దారిద్ర్య దవానలపీడితమైన కుటుంబమున జన్మించి స్వయంప్రతిభా ప్రభావముచే సైనికోద్యోగమున ప్రవేశించి సైన్యాధీశుడై యారోపాఖండమున నిరంకుశ రాజ్యపాలనములనెల్ల గడగడ లాడించి పరాసు సామ్రాజ్యశ్రియ సార్వభౌముడైన నెపోలియన్ ఆ సైన్యాధినాథుడు. అరేబియాదేశపు టుత్తమాశ్వముపై సామాన్య సైనికనాయకుని దుస్తులతో, నిరుగెలంకుల సైన్యాధీశులురా, రానున్న సంగ్రామవిషయమై ముచ్చటించుకొనుచు, నా సార్వభౌము డొకచో పోవుచుండెను. అత్యంత సుందరీవతంసమగు నొక వనిత సుందరుడగు ముద్దుగుఱ్ఱ దోడ్కొని, వెక్కి వెక్కి యేడ్చుచు దుఃఖముతో వాడిన మోముతో నెఱ్ఱవారిన నయనములతో నెదురయ్యెను.

ఆమెదుఃఖ మాతని హృదయమును గలచివైవ దయాంతఃకరణుడై వెంటనే తన గుఱ్ఱమునాపి, యామెతో, భాషించెను.

"అమ్మా! ఎందుకిట్లు దుఃఖించుచున్నావు?"

... ............. .....

"నిన్నెవరు బాధించిరో చెప్పవేమి?"

"నాన్న కొట్టినాడు, అమ్మ ఏడుస్తోంది" అని యామెవెంటనున్న బాలుడు తేనెలొలికించెను. ఆ బాలకుని మాతృభక్తి కత్యంతాశ్చర్యానందమగ్నుడై మరల నాతనితో, "మీనాన్న ఎక్కడ?" అని ప్రశ్నించెను.

"అదో! మీరు. అక్కడ మానాన్న సామాను కాపలా కాస్తాడున్నాడు!" అని వచ్చియు రాని మాటలతో ప్రత్యుత్తర మిచ్చెను.

చక్రవర్తి యంత నామెవంక దిరిగి, "అమ్మా ఆతని పేరేమి?" యని ప్రశ్నించెను.

ఆమె మాటాడదయ్యెను.

"విచిత్రము! భర్త బాధింప దుఃఖించుచున్నావు, పేరడిగిన తెలుపవు! తప్పు నీదై యుండవచ్చునా?"

ఆపల్కు లామె కధిక దుఃఖము గల్గింప "స్వామీ! నాయెడ కించిత్తయినను నేరము లేదు. నాభర్త సర్వసద్గుణుడు. ఐతే అతడీర్ష్యాళువు. ఆపిశాచ మావేశించినపు డూరక నన్ను బాధింపుచుండును. ఐననేమి? నాకతడు ప్రణయనాథుడు. ఈ ముద్దుకుఱ్ఱ

కనుంగుతండ్రి'' యని యూ దుఃఖముతోడనే యా బాలుని ముద్దాడెను.

"సాధ్వీ! నీ కీర్తి వందనీయము. నీ చరిత్ర సంస్మరణీయము. నీ కిదే మా నమస్సులు."

ప్రశ్నించిన యాతఁ డొక్క గొప్ప సైనికోద్యోగియనియు తన విభునామము తెలిపిన భర్త దురంతమునకు శిక్షించుననియు దలంచి యా మానవతి పతినామము తెలుపకనే యాచోటు వీడెను.

ఆ సద్గుణరాసిచేష్ట కద్భుతానంద మనస్కుఁడై తన చెంతనున్నవారితో "చూచితిరె గదా! ఇట్టి మానినీమణులు టులరీస్ * రాజభవనమున నెందరో లేరు. ఇట్టి సతీమణిని బడసినవా డెంత ధన్యుఁడో'' అనుచు తక్షణ మావిషయమును విచారించి, యామె భర్త నామమును దెలిసికొని, యాతఁ డెపుడు చక్రవర్తిని జూచియుండలేదని విని యతనిని తనయొద్దకు పిలిపించెను.

అపారసామ్రాజ్య ధురంధరుఁడై మరుదినము జరుగబోవు మహాసంగ్రామమున జేయవలసిన యేర్పాటు లెన్నియోయుండ నీ కించిద్విషయ మాతడు విచారింప దొరకొనిమెను. మహనీయు లితరుల కార్యములం దెపుడు శ్రద్ధవహించుటం దగ్రగణ్యులు గదా!

* * *

ఆసైనికుఁ డా చక్రవర్తి నెఱుంగడు. అతని ప్రవర్తన బాగుగనుండియుండెను. చక్రవర్తి యతని గని, యిట్లాడెను.

"నీ వెందులకు నీభార్యను బాధించెదవు?''

"ఆవిషయ మిపు డనవసరమని విన్నవించుచున్నాఁడ."

"అట్లు చేయగూడదని యెఱుంగవా?"

"చేయుటకు చేయకుండుటకు నాకు స్వాతంత్ర్యము గలదు. నా యిష్టము వచ్చినట్లు చేయుదును. ఆవిషయమై మీరు ప్రశ్నింపనేల?"

"ఒకవేళ చక్రవర్తియే నీవిషయమై ప్రశ్నించినచో."

"నా భార్యవిషయము నాకువీడి మీ రాచకార్యము జూచుకొమ్మందును."

"నీ విపుడు చక్రవర్తితోడనే మాటలాడుచున్నావు."

ఆమాట లతనినిప్రతిమనుగా జేసివైచెను. భార్యను బాధించిన నేరమునకేగాక చక్రవర్తిని ధిక్కరించిన నేరముగూడ గలసి తన జీవితమునే తుదముట్టించునని యతడు తలంచి, చక్రవర్తి మ్రోల మోకరించి,

"దేవా! మహాపరాధము గావించితి. శిక్ష కర్హుఁడ'' నని దీనాలాపములాడెను.

"నీ భార్యను బాధించుటకు కారణ మిపుడైన దెలుపుదువా?''

"దేవా! చిత్తగింపుఁడు. నాభార్య సకల సద్గుణరాసి. ఆమెను నే నితరులతో మాటలాడకుమనియు, చెలిమి చేయకుమనియు నిర్బంధించినను ఒక్కొకమారు వినదు. అందుచే నీవేళ నామెను కోపముచే మోది

---

* ఫ్రెంచిరాజులు ప్యారిసు నగరమున నివసించు రాజభవనమునకు "టులరీస్" అని పేరు.

తిని. అదియే ఆమె దుఃఖమునకు కారణము."

"మిగుల విచిత్రము. బలవంతపు గాపులుపెట్టి కామినీజనముల నేలునట్టి నెఱజాణవా నీవు! స్త్రీ స్వాతంత్ర్యమే నిన్నును నామెనుగూడ బాగుపడజేయునని యెఱుంగవా? వారి నిర్బంధము మానవాభివృద్ధి కాటంకము గల్గించునని తెలియదా! నీ సతి సద్గుణమే నిన్నిపుడు గాపాడినది. నీవామె కికమీదట స్వాతంత్ర్యమిమ్ము. బాగుపడగలవు. అట్లుగాక నీ దుర్మార్గమును సాగింతువేని కఠినశిక్షకు పాత్రుడవగుదువని యెఱుంగుము. ప్రకృతము నిన్ను యుద్యోగిగ నియమించుచున్నాను." చక్రవర్తి యుదారగుణమునకు పొగడుకొనుచు తన సంకుచిత స్వభావమునకు సిగ్గిలుచు నాతడా చోటువీడెను:

* * *

కొన్ని వర్షములు గడచిపోయెను. మరొక్కమారు నెపోలియన్ ఆ సాధ్వీమణిని ఆమె పతివిషయమై ప్రశ్నించెను. ఆమెయు "దేవా! భవదీయకృపారసము నా సంసారమునకు ఆనందము గల్గించినది. ఈ యపార దయ కేమి ప్రత్యుపకార మొనర్పగలము?"

"సాధ్వీ! నీవు ఆదర్శప్రాయవగు సతిగా మెలంగుము. అదియే నీ ప్రత్యుపకారము" అనుచు మందహాసమొనరించెను.

## మూఢచిత్తమా నమ్ము చిన్మూర్తినెపుడు

శ్రీమతి మల్లాది రాజ్యలక్ష్మిగారు

సీ॥ నిత్యుడై యఖిలంబునిండియుండెడి పరబ్రహ్మంబు తెలియంగ వాంఛలేదో
చిత్స్వరూపుడు సృష్టిస్థితిలయకారణుం డాద్యంతుడవ్యక్తు డాత్మమయుడు
సచ్చిదానందుండు సకలలోకేశుండు ప్రణవస్వరూపుండు భవహరుండు
వేదాంతవేద్యుండు విశ్వస్వరూపుండు భక్తమందారుండు పరమగురుడు

తే॥ జననమరణకర్మంబులు సమసిపోవ
సారహీనంబులౌ నిహసౌఖ్యములను
శాశ్వతంబనియెంచక సకలగతుల
మూఢచిత్తమా, నమ్ము చిన్మూర్తినెపుడు.